బొమ్మా
హేమాదేవి



# ఆలింగనము

సినిమాకి సమయం ఔతోన్నా, లేబొరేటరీలో నుంచి కృష్ణ ఇంకా బైటకు రాకపోవటం మాధవికి మరీ అసహనంగా వుంది. ఇంకా తాళలేనప్పుడు తానే లేబొరేటరీలోకి వెళ్ళి - "కృష్ణా-కృష్ణా" అని పిలిచింది. ఇంకోసారి పిలిస్తేనేగాని 'ఊ' అని పలక లేదు కృష్ణ.

"అబ్బ ఇప్పటికి వినిపించిందన్నమాట" కోపాన్ని ఆపుకుంటూనే అంది మాధవి.

"వినిపించటం అప్పుడే వినిపించింది. పలకటం కొంచెం ఆలస్యంఅయింది" ఏదో రాసుకుంటున్న కృష్ణ తల ఎత్తకుండానే ఈ మాట అని తిరిగి రాయటంలో లీనం అయిపోయాడు.

"పరుగెత్తటమే తెలిసిన కాలానికి, జరిగిపోవటమే తెలిసిన జీవితానికి- మీ ఆలస్యంతో నిమిత్తం ఉండదు" మాధవి అంది కృష్ణ వైపు చురచురా చూస్తూ.

"ఊఁ"

"అమూల్యమైన కాలాన్ని అలక్ష్యం చేస్తున్నారు."

వర్తమాన జీవితంలో సంపన్న వర్గానికి చెందిన స్త్రీకి తీరుబాటు ఎక్కువై కులపురుషునికి తీరుబాటు లేక జీవితం యాంత్రికమైనపుడు "జీవితంలో బోర్డం"కి తట్టుకోలేక పురుషునిపై కసి పెంచుకుని వెర్రిమొర్రి పనులు చేస్తుంటారు. మాధవికి కావలసింది కృష్ణ ఇవ్వలేదు. అప్పుడామె తన సుఖం కోసం తన దారి తను వెతుక్కుంటే....

"ఊఁ ఊఁ"

"అన్ని రకాల ఆనందాలని అలస్యానికే అంకితం ఇవ్వాలన్న ఆశయం ఐతే పెట్టుకోలేదుకదా?" తీవ్రంగా, అవహేళనగా అడిగింది.

కృష్ణ క్షణం తలెత్తి మాధవి ముఖంలోకి చూస్తూ.

"మధూ! ఇప్పట్లో నాకున్నది ఒకే ఒక్క ఆశయం. అది ధనాన్ని ఆర్జించటం" అని తిరిగి రాసుకోసాగాడు.

"ఇంకా ఆర్జించి ఏం చేస్తారు?"

"అన్నీ చేయొచ్చు.... దానితో కాని పనంటూ లేదు...."

"అలా అని మీరనుకుంటున్నారు." కోపంగానే అంది మాధవి.

"నేను కాదు. ఈ మాట ఎవరిని అడిగినా చెపుతారు. ఐనా నీకు మాత్రం తెలియదా? ఏదో కోపం వచ్చి అలా అంటున్నావ్ కాని...." మాధవి ముఖంలోకి చిలిపిగా చూస్తూ, కొంటెగా నవ్వాడు కృష్ణ.

ఆ చిలిపితనానికి- కొంటెతనానికి ఎన్నో రకాలుగా కరిగిపోయిన మాధవి. భర్త ముఖంలోకి చూస్తూ "కృష్ణా" అని పిలిచింది దీనంగా.

"ఊఁ"

హాస్పిటల్ - ఈ లేబొరేటరీ-ఇవి తప్ప జీవితంలో ఇంకా మీకేం అవసరం లేదా?" అడిగింది.

"అన్నీ కావాలి.కాని. ఏది కావాలన్నా ముందు డబ్బు కావాలి." కృష్ణ నవ్వుతూనే అన్నాడు కాని,మాధవి ఇంక తట్టుకోలేక.

"చచ్చిపోయే వరకు ఇదింతేనా"అంది.

"ఏయేయ్....ఏమిటా మాటలు....సినిమాకికదూ మనం వెళ్ళాలి. రైట్ అలాగే పద" పెన్‌కు క్యాప్ తగిలించి కుర్చీలోనించి లేచాడు కృష్ణ.

మాధవి కళ్ళలోనించి నీళ్ళు రాక ముందే కృష్ణ జాగ్రత్తపడ్డాడు సినిమాకి వెళ్తోన్నప్పుడు దార్లో.

"మధూ! కర్తవ్య నిర్వహణలో ప్రోత్సహించాలిగాని ఇట్లా బాధపడితే ఎట్లాచెప్పు" అన్నాడు ఎంతో అనునయంగా.

"భార్యని, పిల్లలని, ఇల్లుని, సంసారాన్ని మరిచిపోవటం మీ కర్తవ్యంగానైతే భావించటంలేదుకదా?" అడిగింది తీక్షణంగా.

"ఓ! నో, నో నెవర్" స్టీరింగ్ ప్రక్కన కూర్చున్న మాధవి చేతిని గట్టిగా పట్టుకుని మృదువుగా వత్తుతూ, నవ్వుతూ అన్నాడు కృష్ణ.

సినిమా చూసి ఇంటికి తిరిగివస్తోన్నప్పుడు దార్లో కృష్ణ "పిక్చర్‌లో మ్యూజిక్ బాగుందికదూ?" అన్నాడు కారుని స్థిమితంగా డ్రైవ్ చేస్తూ.

"నాకు థీమ్ బాగా నచ్చింది."

కృష్ణ నవ్వి "నువ్వీమాటే అంటావని నాకు తెల్సు. కాని కేవలం సెక్స్ కోసం భర్తని వదిలి ప్రియుడి వెంట పారిపోవటం విదేశాల వాళ్ళకి నప్పుతుంది-కాని ఇక్కడ మనవాళ్ళకి కాదు" అన్నాడు.

"ఏం మనవాళ్ళకి రక్తమాంసాలు లేవా?" అడిగింది మాధవి.

"వాటితో పాటు బుద్ధి, సంస్కారం వున్నాయి. ఇవి రక్తమాంసాలని. అదుపులో పెడతాయి -" అని నవ్వి - మళ్ళీ - "పిక్చర్‌లోని మ్యూజిక్ నాకు బాగా నచ్చింది." తన యెడం చేతిలోకి మాధవి కుడిచేతిని తీసుకుని పదిలంగా నొక్కుతూ.. అన్నాడు.

* * *

పోర్టికోలో కారుంచి - ఇంట్లోకి వచ్చి తన గదిలోకని మెట్లెక్కి - పైకి వెళ్తోన్న కృష్ణని - "కృష్ణా" అని పిల్చింది కృష్ణ తల్లి గాయత్రి.

వెంటనే కృష్ణ వెనక్కి తిరిగి—

"ఏమిటమ్మా?" అడిగాడు.

"ఓ రెండు నిమిషాలు ఇటు వచ్చి వెళ్ళు" అంది. క్షణంతో మెట్లు దిగి తల్లి ముందుకి వచ్చి నిల్చున్నాడు.

"కళ్యాణి దగ్గర్నించి ఉత్తరం వచ్చిందిరా....నిన్ను, మాధవిని ఓసారి రమ్మని మరీమరీ రాసింది. దాని పెళ్ళయి ఇన్ని రోజులైంది. నువ్వు ఒక్కసారైనా దానింటికి వెళ్ళలేదు" అంది.


"నిజమేనమ్మా ఒక్కసారి కూడా వెళ్ళలేదు. కాని నేనేం చెయ్యను. నాకు క్షణం కూడా తీరిక లేకుండా పోతోంది."

"పనుల్లో పడి అన్నయ్య ఆత్మీయతనే మర్చిపోతున్నాడని—ఎంతో బాధపడ్తూ- ఇంకెంతో విచారపడుతూ ఉత్తరం రాసిందిరా...."

"కాని - అమ్మా...."

"చూడు నాన్నా."

"అమ్మా! నువ్వైనా నా నిర్బంధాలని అర్థం చేసుకోకపోతే ఎట్లా నమ్మా?" గింగిల లాడిపోయాడు కృష్ణ.



"ఒరేయి కృష్ణా! మనిషికి మమత-మర్యాదలుకూడా అవసరమైనవేరా.... ఓ రెండు రోజులైనా నువ్వు కళ్యాణి దగ్గరకువెళ్ళి రాగలిగితే మంచిది నాన్నా."

"క్షమించమ్మా! నేను రెండు గంటలు కూడా ఇక్కడ్నించి కదల్లేను. హాస్పిటాల్లో ఈ రోజు, రేపుకూడా ముఖ్యమైన కేసులున్నాయి. ఆ మీదటకూడా."

"కృష్ణా! నువ్వు...."

"నేను ఎన్నో అవస్థలు పడిన మీదట. ఈ రోజు ఈ స్థితికి వచ్చాను. బాగా పైకి రాగలిగే పరిస్థితుల్లో వున్నప్పుడు మీరంతా ఎవరికి వీలైన విధానంలో వాళ్ళు నాకు సహకరించాలి గాని అంతరాయం కలిగించకూడదమ్మా."

"రెండు రోజులు చెల్లెలి దగ్గరకు వెళ్ళటం నీ ఉన్నతికి అంతరాయమా?"

"అమ్మా! నీకు అర్థం అయ్యేట్టు నేను చెప్పలేను. నేను చెప్పేదేమీ- నీకు అర్థం కాదు." అని బాధగా నవ్వి-

"కళ్యాణికి నెలలేమో కదా- దాన్ని ఇక్కడకే రమ్మని రాయండి. అన్ని విధాల చాలా బాగా నేను చూసుకుంటాను. డెలివరీ తర్వాత కొన్ని నెలలు ఉండి వెళ్ళుతుంది. మనకైనా - బావకైనా -దానికైనా నిశ్చింతగా వుంటుంది. వెంటనే రమ్మని రాయించమ్మా" బ్రతిమాల్తున్న ధోరణిలో అన్నాడు.

"దాని గురించే కాదురా.... ఇంట్లో నీకో భార్య వున్న సంగతి - ఓ కూతురున్న విషయం కూడా మర్చిపోతున్నావు..నిన్ను నువ్వే మరిచిపోతున్నావసలు.... "

"నన్ను నేను మర్చిపోతున్నానేమో గాని మాధవిని - వీణని, నిన్ను మర్చిపోవటం నిజం కాదమ్మా" అన్నాడు.

గాయత్రి దీర్ఘంగా నిట్టూర్చి "ఇప్పటికే చాలా రాత్రైపోయింది. ఇంకవెళ్ళు.అట్లాగే మాధవిచేత కళ్యాణికి ఉత్తరం రాయిస్తాను" అని మళ్ళీ "ఒరేయ్! నువ్వు డాక్టర్‌వేగాని....నీ ఆరోగ్యం కొంచెం జాగ్రత్తగా చూసుకో నాన్నా" అంది. తన కొడుక్కి నిదుర, ఆహారం, విశ్రాంతి కరువైపోతోన్నాయని మహా దిగులు గాయత్రికి. కృష్ణ అక్కడినించి వెళ్ళిపోగానే తన గదిలోకి వెళ్ళి పడుకుందిగాని ఎంతకీ నిదురరాలేదు ఆ తల్లికి.

* * *

రోజులు మహావేగంగా గడిచిపోతున్నాయి.

కృష్ణ జీవితంలో కూడా మార్పులు వేగంగానే రా సా గా యి. ఎలాగైతేనేం కృష్ణకు సంపాదన బాగా పెరిగింది. మనిషి ఇదివరకటిన్నా బిజీగా తయారయాడు క్రమంగా....

కళ్యాణి వచ్చింది. సుఖ ప్రసవం జరిగింది. అబ్బాయి పుట్టాడు. చెల్లెలికి పురుడు మహాఘనంగాజరిపించాడుకృష్ణ. కాని కళ్యాణికి తృప్తిగాలేదు. ఈ డబ్బు ఈ ఆర్భాటం ఉంటే ఏం లేకపోతే ఏం ఆప్యాయతగా రెండు నిమిషాలు అన్నయ్య నాతో. మాటాడలేకపోతున్నాడు." అని బాధపడుతుంది. అలా అని అన్నని ఏం అనలేదు. కళ్యాణే కాదు. గాయత్రి, వీణ, మాధవి ఒక్కరనేమిటి ఆ కుటుంబ సభ్యులందరికీ కృష్ణ కనిపించటం - పలకరించటం - అపురూపంగా- గగనంగా అయిపోయింది.

మాధవికి రోజంతా భర్త గురించే ధ్యాస. కనీసం రాత్రికైనా భర్తతో తృప్తిగా, గడపలేక పోతూ వుంటుంది. ఒంటిగంటైనా కృష్ణ పడగ్గదిలోకి రాడు. కొన్నిసార్లు - ఏ తెల్లవారుఝామునో వచ్చి పడుకుని - తిరిగి- మాధవి లేవకముందే లేచి - లేబరేటరీలోకి వెళ్ళిపోవటం జరుగుతూ వుంటుంది.

రాత్రిళ్ళు మాధవి డాబా మీద కూర్చుని- ఆకాశంలోకి చూస్తూనో—శూన్యంలోకి చూస్తూనో గడుపుతూ వుంటుంది.

ఆనాడు పూర్ణిమ! పండు వెన్నెల్లో— డాబామీద చంద్రుని వంకచూస్తూ కూచుంది మాధవి.

"మధూ....ఏయ్ మధూ....మాధవీ...." కృష్ణ పిలుపు మీద పిలుపు పిలిచినా—

## గాథావళి:

# సార్థక నామధుడు

1316-1378 మధ్య కాలంలో జర్మనీని పరిపాలించిన నాల్గవ ఛార్లెస్ పేరుకు తగినట్టే ఆయన జీవితంలో జరిగిన ముఖ్య సంఘటనలన్నీ నాలుగు అంకె మీదే జరిగినవి. ఆయన ఏ పని చేసినా నాల్గవ అంకెకు చాలా ప్రాముఖ్యం ఇచ్చేవాడు. ఆయన రోజుకు 4 సార్లు భుజించేవాడు. భోజనము నాలుగు రకాల భక్ష్యలతో 4 రకాల సారాయితో కలిసి ఉండేది. ఆయన నివసించడానికి 4 రాజభవనాలు వుండేవి. ఒక్కొక్క భవనంలో 4 గదులు, ఒక్కొక్క గదికి 4 ద్వారాలు, 4 మేజాలు వుండేవి. ఆయన కిరీటం 4 శాఖలుగా చీలి విస్తరించి వుండేవి. ధరించే దుస్తులు 4 రంగులు కలిగి వుండేవి. నాలుగు భాషలు ధారాళంగా మాట్లాడేవాడు.




చివరకు వివాహము కూడా 4 సార్లు చేసుకున్నాడు. ఆయన అధిరోహించే రథము 4 గుర్రాలచే లాగబడేది. తన సామ్రాజ్యాన్ని 4 భాగాలుగా, సైన్యాన్ని 4 విభాగాలుగా విభజించాడు. రాజధానీ నగరాలను నాల్గింటిని నిర్మించి అన్నిటిలోను సమానంగా సంచరించేవాడు. ఆ చక్రవర్తి చనిపోయేటప్పుడు నలుగురు రాజ వైద్యులు ఆయన శయ్య ప్రక్కనే ఉన్నారు. 1378వ సంవత్సరం నవంబరు 29వ తేదీన సరిగ్గా 4 గంటల 4 నిమిషాలకు కాలధర్మం చెందాడు.

చిట్టచివరకు చనిపోయేటప్పుడు కూడా నాలుగుసార్లు "గుడ్ బై" చెప్పి మరీ సెలవు తీసుకున్నాడు.

—రుద్రరాజు అప్పలరాజు

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విలేపనముతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!

రిస్టు వాచీ

వెల రు. 11/–లు మాత్రమే!

చైన్ సిస్టమ్‌తో 17 జ్యూయలు రిస్టు వాచీ 5 సం॥లు గ్యారంటీ. 11 రూపాయలకే లభిస్తుంది. పోస్టేజి మరియు ప్యాకింగ్ ఛార్జీలు రు. 6–95.

R. Watch Co, (S)
P. o. Mairabarith
(NAWADHA)

బోరొక్రీమ్

ఆంటిసెప్టిక్
పర్‌ఫ్యూమ్‌డ్
క్రీమ్




ఈ యాంటిసెప్టిక్ లేపనము ఉదయము. సాయంత్రం రాసు కొనిన ఎడల, మీ చర్మానికి పోషణ కల్గింది, మెత్తగా, మృదువుగా వుంచి, మచ్చలను మరియు అంటు రోగములను మటు మాయంచేస్తుంది. ఇది సువాసన, పూలవంటి తాజాద నాన్ని రోజంతా మీకు కలిగిస్తుంది.

ఫార్మా మెడికొ (ఇండియా) ప్రై. లి.
బొంబాయి 400060

ఏజెంట్లు: సిటీ ఫార్మా డిస్ట్రిబ్యూటర్సు,
భావనారాయణ వీధి,
విజయవాడ–1 (ఆం. ప్ర.)


మాధవికి వినిపించనె లేదు, కృష్ణ మాధవికి మరీ దగ్గరగా వచ్చి ఆమెను కుదుపుతూ—

"పిలిస్తేపలకవేం? ఏం చేస్తున్నావ్!" అని అడిగి. ఆకాశం వైపు తాను కాస్సేపు చూసి—

"ఈ వెన్నెలలో స్నానం ఆడుతున్నావా?" అడిగాడు, మాధవి చెంపల్ని నిమిరి చిన్నగా ముక్కు పిండుతూ—

"భోజనం మీ గదిలో టేబుల్ పైన వుంది" మాధవంది మెల్లిగా.

"తిన్నాను."

"నిన్న కూడా నిదురలేకుండా లేబరేటరీ లోనే గడిపారు.... ఈ రోజైనా కాస్సేపు నిదురపోక, ఇక్కడి కెందుకు వచ్చారు? దయచేసి వెళ్ళి నిదురపోండి – ప్లీజ్" మాధవి మాటలకు కృష్ణ చిన్నగా నవ్వుతూ– మాధవి ప్రక్కన కూర్చుని –"

"ఈ కోపం – అలక, బాధ ఇవన్నీ నేను నిదురపోనందుకేనా?" కవ్వింపుగా అన్నాడు.

"కోపమనేముంది? మరీ నిద్దర్లేకుండా వుంటే జబ్బు చెయ్యొచ్చని"

"నాకు జబ్బా! డాక్టర్ని!!"

"నేను డాక్టర్ని కాదుగా – నాకు రావచ్చు – పదండి" అంది విసురుగాలేస్తూ మాధవి.

"ఇంతకూ నీకీ తొందరంతా నిదురపోదామనేనా?" మాధవిని తన ఒడిలోకి లాక్కుంటూ అడిగాడు కృష్ణ.

"రోజురోజుకీ మరీ అల్లరిగా తయారౌతున్నారు.

"ఏం చేయనూ!? నీ సహవాసం అలా చేస్తోంది నన్ను" మాధవి ముఖంమీది ముంగురులు సవరించి—పెదిమల మీద చేతివ్రేళ్ళతో రాస్తూఅన్నాడు కృష్ణ. మాధవి తన్మయత్వంగా రెండు కళ్ళు మూసుకుని "కృష్ణా!" అని పిలిచింది. వెంటనే కృష్ణ– మాధవిని ఇంకా దగ్గరకు అదుముకున్నాడు.

"కృష్ణా ఈ క్షణాలు ఇట్లాగే నిలిచిపోయేమార్గమేదైనా వుంటే చెప్పుకృష్ణా!" అంది ఎంతో మెల్లిగా.

"డిస్టర్బ్ చేయకు" అన్నాడు.

అప్పుడె పడగ్గదిలోవున్న ఫోన్ గణగణమని చప్పుడు చేసింది. అదిరిపడ్డ మాధవి "వెళ్ళకండి ప్లీజ్" అంది, ఎంతో దీనంగా.

"వెళ్ళను మధూ నిజంగానే వూరికినే విషయం ఏమిటా అసలు ఎవరోనైనా కనుక్కోకపోతే ఏం బాగుంటుంది....అను కుంటూనే లేచి వెళ్ళి కృష్ణ ఫోన్ రిసీవ్ చేసి–

"ఎస్! డాక్టర్ కృష్ణ స్పీకింగ్....ఓ! డాక్టర్ విజయ్! గుడ్‌నైట్!" అని ఓ రెండు నిమిషాలు అటువైపు మాటలన్నీ విని తర్వాత

"ఔను.పదిహేనవ నంబరు పేషెంట్‌కి కూడా....ఆ పేషెంట్ సీరియస్‌గా వున్నాడా– ఐతే నేనే వస్తాను....ఇదో ఇప్పుడే బైలుదేరబోతున్నాను." అని గబగబా నైట్‌డ్రెస్ మార్చుకుని ప్యాంట్ షర్ట్ వేసుకుని మాధవిని దగ్గరకు తీసుకుని ఆమె కన్నీటిని తుడుస్తూ—

"ఏడ్వకూడదు మధూ!" అన్నాడు.

"ఫర్వాలేదు– మీకు తుడవటం బాగానే వస్తుందిగా" ఉక్రోషంగా అంది మాధవి.

"నేను డాక్టర్ని మధూ! ఓ ప్రాణాన్ని కాపాడాల్సి వచ్చినప్పుడు కొన్నిసార్లు ముఖ్యమైన అవసరాల్నికూడా ఆపుకోవాల్సి వస్తుంది."

"బైటివాళ్ళ ప్రాణాలు కాపాడాలంటే ఈ డాక్టర్లకి ఇంట్లో వాళ్ళ ప్రాణాల్ని తీయక తప్పదేమో!" అంది మాధవి అసహనంగా.

"నేను చేస్తోంది గవర్నమెంటు ఉద్యోగం కొట్లో ఖాతా రాయటం లేదు. ఎప్పుడు పిలిస్తే అప్పుడు వెళ్ళాల్సి వస్తుంది" కాళ్ళకు షూ వేసుకుంటూ అన్నాడు కృష్ణ.

"డబ్బు బాగానే సంపాయించారుగా.... ఉద్యోగం వదిలి ఏదైనా వ్యాపారంపెట్టండి ఈ బాధ వుండదు. నేను నిజంగానే అంటున్నాను." అంది మాధవి.

కృష్ణ అంత తొందర్లో కూడా కొంచెం గట్టిగానే నవ్వి.

"నీలాగే అకస్మాత్తుగా ఏ వ్యాపారి భార్యైనా తన భర్తని వ్యాపారం వదిలి– ఏదైనా ఆపరేషన్ చేయమంటే అతని అవస్థ ఎట్లా వుంటుందో!" అని మళ్ళీ నవ్వి అలా నవ్వుతూనే వెళ్ళిపోయాడు కృష్ణ.

"ఇంకా ఏ బతుకైనా ఇంత పాడుగా ఉండదేమో!" మాధవన్న మాటలు కృష్ణ చెవుల్లో పడ్డాయి .... ఐనా కృష్ణ వెళ్ళిపోయాడు.

* * *

ఇంకోరోజు తెల్లవారిపోయాక కృష్ణ ఇంట్లో అడుగుపెట్టాడు. పోర్టికో దగ్గరే కూతురు వీణ కన్పించి కృష్ణను విష్ చేసి–

"నాన్నా! నిన్న మీమీద నాకు బాగా కోపం వచ్చింది" అంది. తండ్రి దగ్గరకు తీసుకోగానే వెళ్ళి.

"కొంచెం కోపంవస్తే ఇబ్బందిగాని కోపం బాగావస్తే ఫరవాలేదు. అది ఎక్కువ

'పేపు నిల్చి వుండదు" అని వీణని ఎత్తుకుని ఇంట్లోకి నడుస్తూ.

"ఐనా వీణ తల్లికి కోపం ఎందుకు వచ్చిందిటా?" అడిగాడు.

"నా కూతురు పెళ్ళికి మిమ్మల్ని పిలిస్తే రాలేదుగా!"

"ఓ" అని నవ్వి "నేను రాకపోతేనేం! పెళ్ళి బాగా జరిగి వుండొచ్చుగా" అడిగాడు.

"ఎక్కడనాన్నా! ఆపెళ్ళి చెడిపోయింది. జానకి తన కొడుక్కి నా కూతుర్ని చేసుకోదట" చాలా బాధగా, కోపంగా తండ్రితో చెప్పింది వీణ.

కృష్ణవచ్చే నవ్వుని బలవంతంగా ఆపుకుని—

"ఈ డబ్బు తీసుకో అమ్మా" అన్నాడు జేబులో నించి కొంత డబ్బు తీసిస్తూ. వీణ డబ్బువైపు అయిష్టంగా చూస్తూ—

"నాకు డబ్బు వద్దు" అంది.

"నీకూ డబ్బు వద్దా? మరేం కావాలి?"

"మగ బొమ్మ కావాలి."

"ఈ డబ్బు రంగయ్యకివ్వు. చక్కని మగబొమ్మ తెచ్చిస్తాడు తల్లీ" అని గదిలోకి రాగానే వీణను క్రిందకు దింపాడు. అక్కడే వున్న మాధవి.

"బొమ్మ కాబట్టి – డబ్బుతో కొని కూతురు కిస్తున్నారు" అంది నిషూరంగా..

"బొమ్మలైనా సరే – అన్ని బొమ్మల్ని మనం కొనలేము మధూ! మనుషులైనా కొందరు కొంటే దొరుకుతారు. నువ్వు పిచ్చిదానవు – నా మీద కోపం తెచ్చుకోవటం తప్ప – నీకేం తెలియదు" అన్నాడు నవ్వుతూ నే కృష్ణ.

"మీరు రాగానే ఈ మాట అడుగుతున్నందుకు క్షమించండి. తిరిగి మీరు హాస్పిటల్‌కి ఎప్పుడు వెళ్ళాలి?" అంది మాధవి.

"రేపు."

"నిజంగానా?"

"నిజంగానే."

"మిమ్మల్ని నమ్మి ఎన్నడు ముందర పడ్డానుకాని. మీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి– ఎప్పుడు మాటాడమంటారు" అడిగింది.

కృష్ణ పకపకా నవ్వి "ముఖ్యమైన విషయాలు మాటాడేందుకు ఎప్పుడూ తొందర పడకూడదు" అన్నాడు.

"ఆ విషయం తెలిసే అంటున్నారు."

"ఏం తెలుసు పచ్చిపులుసు." వెక్కిరించాడు కృష్ణ.

"ఛా – ఛా – డాక్టరై వుండి కూడా – మరీ మోటుగా – అసభ్యంగా...."

"డాక్టరైతే ఏం! భార్య దగ్గర కూడా – నాజూగ్గా– సభ్యతగా వుంటే ఇహ ఐనట్టే– అన్నట్టు వీణ పుట్టేదేకాదు –" కృష్ణ మాటలకు మాధవి ముఖం విౖరపడింది. గదిలో నిల్చోలేక "మీరు స్నానం చేయండి నేను కాఫీ తెస్తాను" అని బైటపడింది.

మధ్యాహ్నం భోజనం తర్వాత కృష్ణ పడగ్గదిలోకి వెళ్ళి "మధూ! ఇవ్వాళ్టి పేపర్ తీసుకురా" పిల్చాడు మాధవిని. కృష్ణ చేతికి పేపరిచ్చి వెంటనే వెళ్ళి పోబోయిన మాధవి కొంగును పట్టుకుని ఆపి "అప్పుడే వెళ్ళిపోతున్నావేం?" అడిగాడు కృష్ణ.

"అవతల నాకు చాలా పనుంది."

"అబద్ధా లాడితే పాపం తగుల్తుంది. నాకు తెల్సు నీకేంపనిలేదు." అన్నాడు కృష్ణ. మాధవి సమాధానం ఏం ఇవ్వలేదు. మనిషి మాౖతం ఎందుకో మరీ బాధపడుతోన్నట్టుగావుంది. కృష్ణ "కూర్చో" మనగానే మంచంమీదే కృష్ణ పక్కనే కూచుంది.

"ఇంట్లో నీకు ౖపొద్దు గడవకపోతే ఏదైనా పరీక్షకి ఎందుకు కూర్చోవు?" కృష్ణ అన్నాడు.

"పరీక్షకి కూర్చున్నట్టుగానే వుంది ౖబతుకు" ఎంతో నిరుత్సాహంగా, దిగులుగా అంది.

కొంచెం ఆగి కృష్ణ.

"మధూ, మా నాన్న ఎంత బీదరికాన్ని అనుభవించారో నీకు తెలుసా?"

"అప్పుడప్పుడు అత్తయ్య చెప్తూంటారు."

"మొదట్లో చాలా ధనవంతులు మా నాన్న, కాని – పని పాట చేయకుండా ఇంట్లో భార్యని ముందు కూర్చోబెట్టుకుని ఆమె తోటే ౖపపంచంగా ఉండేవారు. భార్యా పిల్లలు ఇల్లు విడిచి ఎక్కడికీ కదిలేవారుకారు. పనేం చేయకపోవటంవల్ల ఉన్న పనులని సరిగ్గా చూసుకోకపోవటంవల్ల కొంత ఆస్తి పాడైపోయింది. కొంతఆస్తినేమో అమ్ముకుంటూ తిన్నారు. చివరి రోజుల్లో అమ్ముకోవటానికికూడా ఏం లేనప్పుడు–

ఇప్పటికైనా బైటకువెళ్ళి నాల్గు డబ్బులు సంపాయించే పనేమైనా చూడండి అని అమ్మ ఏడిచినా, మొత్తుకున్నా నాన్న, వినేవారు కారుట.

"ఏమో! మిమ్మల్ని వదిలి బైటకే వెళ్ళ బుద్ధేయదు" అనేవారుట 'నాన్న. కొన్ని సార్లు అప్పుకుకూడా నోచుకోనప్పుడు అమ్మ ఏడుస్తూ.

"మీకు ఆకలి వేయటంలేదా?" అని ఇప్పుడు నువ్వు నన్ను అడుగుతూ ఉంటావు అట్లా మా అమ్మ మా నాన్నని అడిగితే నాన్న నవ్వుతూ—

"నువ్వు నమ్మవు కాని నిన్ను, పిల్లల్ని చూస్తూ రోజుల పర్యంతం భోంచేయకుండా కూడా వుండగలను" అని అనే

ప్రముఖ చలనచిత్ర
రచయిత, దర్శకులు
శ్రీ దాసరి
నారాయణరావు
'స్నేహ'కై
ప్రత్యేకంగా వ్రాస్తున్న సీరియల్
'చిన్ననాల కథలా
[illegible] వనితలకు
బాలలకు ప్రత్యేక
అనుబంధాలతో
త్వరలో
మీ ఇంటికి
మరో బంధువు!
స్నేహ
సకుటుంబ
మాసపత్రిక
గాంధీనగరం,
విజయవాడ-520003

వారు. అప్పుడు మా నాన్నని ఇంట్లో వాళ్ళంతా-ఇప్పుడు నన్ను చూసి మీరంతా విసుక్కుంటోన్నట్టుగా విసుక్కునేవారు. ఆ తర్వాత అమ్మ ఆ ఉన్న ఒక్క ఇంటిని అమ్మి మా చదువులు, పెళ్ళిళ్ళు-అవి జరిపించింది. ఐతే నువ్వే చెప్పు మధూ, మనిషి ఎట్లా మసులుకోవాలి?"

"అన్నీ సమపాళ్ళలో వుండాలి. అప్పుడైతేనే జీవితం సుఖంగా సాగిపోతుంది. మామగారిలా పనిచేయకుండాను — మీలా అస్తమానం తీరుబాటు అంటూ లేకుండా పనీ పని అంటేనే నష్టాలు - కష్టాలు.... అంతా సమపాళ్ళలో వుంటే-"

ఉచితము ! ఉచితము !

తెల్ల మచ్చలు

మా చికిత్స ప్రారంభించగానే మచ్చల రంగులో మార్పు వస్తుంది. పరీక్షించి మా మందు ఎంత పని చేస్తుందో చూడండి. రోగి వివరాలు వ్రాసి ఉచితంగా ఒక పాకెట్ మందు పొందండి.

LALIT AYURVEDIC PHARMACY (AJ)
P.o. Katrisarai (GAYA)




దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!



హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవసర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు, పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును.
వరిబీజము (బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండ రండి.

డా॥ దేవర, ఫోన్ 551,
మార్వాడి గుడి వద్ద, తెనాలి.
బ్రాంచి: 9-డి, శివాజీ స్ట్రీట్, మద్రాసు-17.

"అప్పుడూ సాగదు మధూ! మనిషికి ఆశలు కోరికలు ఎక్కువ - ఒకటి దొరికితే ఇంకోటి కావాలంటాడు. తృప్తిపడటం రానంతవరకు అశాంతి తప్పదు. నీ విషయమే చూడు. ప్రేమించి పెళ్ళి చేసుకున్నావు. అనుక్షణం అనురాగం గుమ్మరించే తల్లి లాటి అత్త - ఆత్మీయంగా - ప్రేమగా తన తోబుట్టువులా చూసుకునే ఆడబిడ్డ. మామూలు సంసారాల్లో వుండే ఏ గొడవలూ లేవు నీకు, 'పిల్లలు' అని జ్ఞాపకమైనా రాకముందె వీణ పుట్టింది. చేతి నిండా డబ్బు.... ఇంటి నిండా సౌకర్యాలు, నౌకర్లు, చాకర్లు నీకేం తక్కువవుందని ఈ బాధ, ఈ అశాంతి!?"

"ఇవన్నీ వుండటంవల్లనే కావచ్చు. మీరు దగ్గరలేని లోటు మరీ కనిపిస్తూ వుంటుంది."

"నేను కేవలం నీదగ్గరే వుండిపోతే కొన్ని సుఖాలు, సౌకర్యాలు క్రమంగా తగ్గిపోతాయి."

"తగ్గిపోనీయండి?"

"ఓరోజు ఏమీ లేకుండా పోవచ్చు."

"పోనీండి మీరు నాదగ్గర వుంటే నాకింకేం అవసరంలేదు."

"హు! ఎంత అజాగ్రత్తగా, అనాలోచితంగా మాటాడ్తున్నావు మాధవీ! ఆకలి, దారిద్ర్యం గురించి కూడాఊహించలేకపోతున్నావు. ఆకలి దాని అవసరం ముందు భర్త అతని అవసరం ఓ లెక్కలోకి రాదు మధూ."

"మీరన్నది నిజం కావచ్చు. కాని నేనన్నేది కూడా అబద్ధం కాదు. ఎన్ని ఉన్నా, లేకపోయినా భర్త కావాలి అనిపించవచ్చు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే పరువు, ప్రతిష్ట నీతినిజాయితీ ఇవన్నీ పోయినాస్త్రీకి పురుషుడు కావాలని, పురుషుడికి స్త్రీ కావాలని అనిపించవచ్చు"

"అదే మధూ! అలాటి సమయాల్లో మనిషిని బుద్ధి, సంస్కారం కంట్రోల్ చేసేది మధూ! దేన్నైనా మనిషి ఎదుర్కోగలగాలి. కాని లొంగిపోకూడదు. అందుకే మన పూర్వులు రామాయణం, మహాభారతంలాటి గ్రంథాలని పవిత్ర గ్రంథాలుగా భావించి వాటిని మనల్ని చదువుకోమని చెప్పింది. రాజ్యం వదులుకోవాల్సి రాగానే రాముడు తన ఆదర్శాన్ని, నియమాన్ని, కర్తవ్యాన్ని వదులుకుంటే ఈ రోజు మనకు రామాయణమే ఉండేదికాదు. అలాగే భారతం..."

"అబ్బ! వదలండీ మరీ బోర్ కొట్టించకండి" విసుక్కుంది మాధవి. వెంటనే కృష్ణ క్షణం ఆలోచించి నవ్వి.

"జిత్‌నా జరూరీ హై మన్ కా మిలన్ ఉత్‌నా జరూరీ హై తన్ కా మిలన్" అంత

## హైకోర్టు న్యాయమూర్తిగా వచ్చిన ప్రథమ మహిళ



ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా శ్రీమతి గోనమనేని అమరేశ్వరి నియమితులయ్యారు. న్యాయవాదవృత్తిలో వుంటూ సరాసరి హైకోర్టు న్యాయమూర్తి పదవికి వచ్చిన ప్రథమ మహిళ ఈమె.

శ్రీమతి అమరేశ్వరి వయస్సు 48 సంవత్సరాలు. గుంటూరుజిల్లా అప్పికట్ల గ్రామంలో జన్మించారు. ఆంధ్రా యూనివర్శిటీలో యం. ఎ. న్యాయశాస్త్రం చదివారు. 1954 నుంచి లా ప్రాక్టీసు చేస్తున్నారు. 1974లో ఈమె ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులయ్యారు. 1975-76లో హైకోర్టు న్యాయవాదుల సంఘంకు వైస్ ప్రెసిడెంట్‌గా వున్నారు. ఈమె ఈ నెల 14వ తేదీన ఆంధ్రప్రదేశ్ హైకోర్టున్యాయమూర్తినా పదవీస్వీకారం చేశారు.

---

వరకు రాగయుక్తంగా పాడి - "హైనా?" అడిగాడు నవ్వుతూ కృష్ణ....

కృష్ణ పాటల్ని బాగా అనుకరించగలడు-

"మీరు చాలా చక్కగా పాడగలరు........ మిగతా పాట పాడండి" ప్రాధేయపడ్తూ అడిగింది మాధవి. కృష్ణ కంఠం ఎత్తుకోబోతున్నప్పుడు. ఫోన్ మ్రోగగానే - మాధవి రివ్వున లేచి గదిలో నుంచి బైటకు వెళ్ళిపోయింది.

మాధవి ఇష్ట ప్రకారంగానే జీవించటానికి కృష్ణ ఎంత ప్రయత్నించినా వీలు కానప్పుడు "ఈ రిసెర్చ్ పూర్తి కాగానే నువ్వు అనుకున్నట్టుగానే బ్రతుకుదాం మధూ" అని చెప్పాడు భార్యతో కృష్ణ.

"మీ రిసెర్చ్ ఎప్పుడైపోతుంది?"

కృష్ణ నవ్వి 'చాలా తొందర్లో' అన్నాడు.

కొన్ని నెలలు గడిచిపోయాయి.... ఓ రోజు కృష్ణతో డాక్టర్ విజయ్ చెప్పాడు.

"డాక్టర్ కేశవ్ ఉద్యోగం రిజైన్ చేసి

బాంబే వెళ్ళిపోతున్నారు" అని. కృష్ణ డాక్టర్ విజయ్ వైపు ఆశ్చర్యంగా చూస్తూ—

"ఎందుకు డాక్టర్?" అని అడిగాడు.

"అక్కడికి వెళ్ళి ఏదో బిజినెస్ చేస్తాడట-"

"వ్హాట్!! డాక్టరయి వుండి బిజినెస్ చేస్తారా?" ఈసారి మరీ ఆశ్చర్యపోయాడు కృష్ణ.

"అతనేదో ప్రేమ వ్యవహారంలో పడ్డట్టు పుకార్లు బైలుదేరాయ్ డాక్టర్" విజయ్ అన్నాడు నవ్వుతూ.

"ఓ....ఐసీ...." కృష్ణ కూడా నవ్వాడు.

ఫేర్‌వెల్ పార్టీకి తప్పకుండా వస్తానని విజయ్‌తో ప్రామిస్ చేశాడు. డిన్నర్ కోసం డబ్బు కూడా ఇచ్చాడు. కాని ఇంకో రోజు ఓ రాత్రిపూటగాని కృష్ణకు గుర్తుకు రాలేదు పార్టీ గురించి. వెంటనే గడియారం చూసుకుంటే మూడు గంటలైంది. చాలా బాధపడ్డాడు. తెల్లవారగానే విజయ్‌కి ఫోన్ చేసి జరిగింది చెప్పి క్షమించమని అడిగి "కేశవ్ బాంబే ఎప్పుడు వెళ్తున్నాడు? కనీసం "సెండాఫ్" చేయడానికైనా వస్తాను" అన్నాడు కృష్ణ.

"పద్దెనిమిదిఉదయం ఫ్లైట్‌కు అంటే రేపే" అని చెప్పాడు డాక్టర్ విజయ్. ఆ రోజు రాత్రి మాధవి లేబరేటరీలోకి వెళ్ళి "మీతో చాలా ముఖ్యమైన విషయం గురించి మాటాడాలి. మీరు కొంచెంఐనా స్థిమితంగా కనిపిస్తారేమోనని చూస్తే అది ఇప్పట్లో మీకు దొర్కేలా లేదని ఇహనేను ఇక్కడికే వచ్చాను క్షమించండి" అంది.

కృష్ణ నవ్వాడు. కాని చాలా అలసటగా.

మాధవి కృష్ణ అలసట గురించిగాని - నవ్వు గురించిగాని పట్టించుకోలేదు. తన మాటకి సమాధానం కావాలన్నట్టు నిల్చుంది.

"మధూ! నాదో చిన్న విన్నపం...." నవ్వుతూ మాధవి వైపు చూస్తూ అన్నాడు కృష్ణ.

"సెలవివ్వండి" అంది వెటకారంగా మాధవి.

"ఇప్పుడు నన్నేం డిస్టర్బ్ చేయకు. రేపుదయంనించి నేను రాత్రి వరకుకూడా ఫ్రీగా ఉంటాను. రోజంతా ముఖ్యమైన విషయాల గురించే మాట్లాడుకుందాం సరేనా?" అడిగాడు.

మాధవి క్రొత్త విధానంలో నవ్వి 'సరే' అని అక్కడ్నించి వెళ్ళిపోయింది. మాధవి నవ్విన విధానానికి కృష్ణ క్షణం అదోలా ఫీలైనా తిరిగి పనిలో లీనం ఐపోయాడు.

మరునాడు కృష్ణ ఉదయాన్నే లేబరేటరీ వదిలి ఇంట్లోకి వచ్చాడు. ముఖం కడుక్కోవటం అయిపోగానే - "మధూ! కాఫీ!" అన్నాడు ఓ వైపు టవల్తో ముఖం తుడుచుకుంటోనే. ఇంకో రెండు సార్లు పిల్చిన మీదటకాని మాధవి రాలేదు. ఆ రావటం కూడా ప్రయాణపు దుస్తులతో వచ్చింది. ఐతే కాఫీ మాత్రం తీసుకొచ్చింది.

"ఇంత ఉదయమే ఎక్కడికి వెళ్ళే తయారీ?" కాఫీ అందుకుంటూ అడిగాడు కృష్ణ. మాధవి సమాధానం ఇవ్వలేదు. కృష్ణకు ఎదురుగా వున్న సోఫాలో కూచుంది. మామూలు రోజుల్లో అయితే - కృష్ణ ప్రక్కనే కృష్ణని అంటుకునే కూచునేది. మాధవి ప్రవర్తనకు కృష్ణ కొంచెం గట్టిగా నవ్వి.

"నువ్వు సత్యభామవి- నీ కోపంకూడా అందంగా ఉంటుంది" అన్నాడు కాఫీ సిప్ చేస్తూ....మాధవి కృష్ణ మాటలకి సమాధానం ఇవ్వకుండా కొంచెం ఆగి—

"ఈ రోజు ఉదయం ఫ్లైట్‌కు నేను బాంబే వెళ్తున్నాను" అంది.

"బాంబేనా? ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు కృష్ణ.

"రేష్మా మీకు తెలుసుకదా! దానికి పెళ్ళట. వెళ్ళకపోతే వూరుకోదు" మధ్యలోనే కృష్ణ ఏదో అనబోతే అంతకన్నా ముందే మాధవి—"నేను తిరిగి తొందరగానే వస్తాను. పోతే రెండురోజులకోసమే వెళ్తున్నాను కాబట్టి, వీణని కూడా అత్తయ్య దగ్గరే ఉంచి వెళ్తున్నాను" అంది.

"నిన్ను విడిచి అది వుండగలదేమో కాని, దాన్ని విడిచి నువ్వుండగలవా?" మళ్ళీ ఆశ్చర్యంగానే అడిగాడు కృష్ణ.

"ఉండగలను" పట్టుదలగా అంధి మాధవి.

కృష్ణ ఖాళీ కప్పుని ప్రక్కన టేబుల్‌పై ఉంచి లేస్తూ 'ఆల్‌రైట్ అలాగే వెళ్ళిరా' అన్నాడు. అయిష్టంగా నిరుత్సాహంగా. మాధవి ఇంకేదో చెప్పబోతోంది. ఈలోగా డాక్టర్ విజయ్ నించి కృష్ణకు ఫోన్ వచ్చింది. "కేశవ్‌ని కలుసుకోవడానికి ఇంటికి ఐతే తొందరగా వచ్చేయండి కొంచెం సేపట్లోనే ఏర్‌పోర్ట్‌కి వెళ్ళిపోతున్నారంతా....నేను కూడా ఏర్‌పోర్ట్‌కి వెళ్ళటం లేదు. ముఖ్యమైన కేసొకటి వుంది. మా ఇంటికి రండి. ఇద్దరం కలిసి కేశవ్ ఇంటికి వెళ్దాం" అని.

"అలాగే ఇప్పుడే వస్తున్నాను" అని చెప్పి రిసీవర్ పెట్టేశాడు కృష్ణ. "పదినిమిషాల్లో నేను తిరిగి వస్తాను మధూ!" అని మాధవి సమాధానానికైనా చూడకుండా వెంటనె వెళ్ళిపోయాడు కృష్ణ.

మాధవి మనస్సు గిలగిలలాడింది.




పసి బిడ్డకు జీర్ణసంబంధమైన బాధలు కలిగినప్పుడు...



సౌమ్యంగా పనిచేసే

అమృతాంజన్ గ్రైప్ మిక్స్చర్

బాధను అతి త్వరగా తగ్గిస్తుంది




OBM 3410/4 TG

కడుపునొప్పి, అజీర్ణము, పాలుపళ్ళు వచ్చేటప్పుడు కలిగేబాధలు మొదలైన వాటితో జీవితోనైనా సరే మీ పసిబిడ్డ బాధ పడుతూంటే అమృతాంజన్ గ్రైప్ మిక్స్చర్‌తో అతి త్వరగా ఉపశమనం కల్గించండి త్వరగా సులభంగా తిరిగి మీ పసిబిడ్డ ఆనందంగా నవ్వుతుంది

గృహౌషధముల తయారుచేయుటలో తరతరాలుగా నమ్మకకు పాత్రమైన అమృతాంజన్‌వారి తయారి.

అమృతాంజన్ లిమిటెడ్

అయినా మళ్ళీ వెంటనే "పోతే పోనీ" అనుకుంది కసిగా. కృష్ణ విజయ్ ఇంటికివెళ్ళి అక్కడ్నించి వాళ్ళిద్దరూ కేశవ్ ఇంటికి వెళ్ళారు. కేశవ్‌ని ఏర్‌పోర్ట్‌కి పంపించాక అక్కణ్నించే విజయ్ హాస్పిటల్‌కు వెళ్ళిపోయాడు. కృష్ణకు ఉన్నట్టుండి మధు గుర్తుకు వచ్చింది. మధు బాంబే వెళ్తున్నానని చెప్పినా, తాను నిర్లక్ష్యంగా బైటకు వచ్చాడు. మధుని ఎప్పుడైనా ఏర్‌పోర్ట్‌లో తానే డ్రాప్ చేసేవాడు. ఐనా పెళ్ళి తర్వాత మధు ఒంటరిగా చాలా తక్కువ సార్లు ప్రయాణం చేసింది. కారణం ఏదైనా మధుకి తన మూలాన బాధ బాగానే కలుగుతోంది. ఇవన్నీ యోచిస్తే 'బద్' గానే ఫీలయ్యాడు కృష్ణ. ఏర్‌పోర్ట్‌లో నైనా మధుని కలుసుకోవాలి. లేకపోతే అటు మధుకి ఇటు తనకి చాలా బాధగా వుంటుందని – ఏర్‌పోర్ట్‌లో తనని చూసి మధు ఎంతో సంతోషపడ్తుందని – మాధవి గురించే యోచిస్తే కృష్ణ ఏర్‌పోర్ట్ వైపు దారితీశాడు.

మాధవి ఏర్‌పోర్ట్‌కి బైలుదేర్తోన్నప్పుడు వెంట ఎవరినీ వద్దని దార్లో కృష్ణ తనని కల్సుకుంటాడని అత్తగారితో అబద్ధం చెప్పింది. ఐనా కోడలి వెంట ఓ మనిషిని పంపించింది గాయిత్రి.

ఏర్‌పోర్ట్‌లో మాధవి కూర్చున్న టాక్సీ ఆగగానే కృష్ణ వచ్చి టాక్సీడోర్ తెరవడంతో మాధవికి చచ్చినంత పనైంది.

"సారీ మధూ! తొందర్లో నీ ప్రయాణం గురించి మరచిపోయాను." కృష్ణ నిర్మలంగా నవ్వుతూ అన్నాడు. మాధవి అట్లాగే కూర్చుండిపోయింది.

"రా మధూ" భార్యకి చేయి అందిచ్చాడు కృష్ణ. ఆ చేయి ఆధారంతో మాధవి టాక్సీలోనించి బైటకు దిగింది. కాని మాధవి ముఖం అంతా మాడిపోయినట్టుగా వుండటం కృష్ణకు చిత్రంగా అనిపించి "ఏమిటి మధూ ఏమైంది? ఆరోగ్యంగా లేదా?" గబ గబా అడిగాడు.

"ఏం లేదు" అంది అతి ప్రయత్నం మీద ఈ లోగా ఇంకో డాక్టర్ కనిపించి

"హాయ్ కృష్ణా, రండి. కేశవ్ వాళ్ళు లౌంజ్‌లో వున్నారు" అన్నాడు కృష్ణ. "ఈమె నా భార్య మాధవి, వారు డాక్టర్ రాఘవేంద్రరావు" ఒకరిని ఒకరికి పరిచయం చేశాడు.

తర్వాత మాధవి చేతిని తన చేతిలోకి తీసుకుని డాక్టర్ రాఘవేంద్రతో పాటు లౌంజ్ వైపు నడిచాడు. అక్కడ డాక్టర్ కేశవ్‌ని సెండాఫ్ ఇవ్వడానికివచ్చిన డాక్టర్లతో కోలాహలంగా ఉంది. అంతా ఏవో జోక్సు వేసుకుంటూ నవ్వుకుంటున్నారు. కేశవ్ ఎన్నడూ లేనంత ఉత్సాహంగా ఉన్నాడు. ఐతే మధ్య మధ్య ఎవరికోసమో మరీ నిరీక్షిస్తోన్నట్టుగా మాత్రం ఉన్నాడు. కృష్ణ కనిపించగానే మహా ఉత్సాహంగా కేశవ్ ఏదో చెప్పబోయిన వాడల్లా కృష్ణ చేతిలో మాధవి చేయి కనిపించగానే కేశవ్ ముఖంలో విపరీతమైన విధానంలో రంగులు మారాయి.

కేశవ్ ముఖంలో ఆ మార్పు, ముఖ్యంగా మాధవిని చూడగానే రావటం చాలా చిత్రంగా అనిపించింది కృష్ణకు. ఐనా ఈమె నా భార్య మాధవి. వీరు డాక్టర్ కేశవ్. ఒకరిని ఒకరికి పరిచయం చేశాడు. హల్లో అంటే హల్లో అనుకున్నారు ఇద్దరూ. కాని ఆ ఇద్దరిలో ఒక్కరికీ జీవం ఉన్నట్టుగా అనిపించలేదు. మాధవైతే కొన ఊపిరితో ఉన్నట్టుగా ఉంది. కృష్ణ చేతిని మాత్రం గట్టిగా పట్టుకుంది.

కృష్ణకు ఉన్నట్టుండి అకస్మాత్తుగా విజయ్ అన్న మాటలు గుర్తుకు వచ్చాయి.

"డాక్టర్ కేశవ్ ఉద్యోగం వదిలి – బిజినెస్ చేస్తారట-ఏదో ప్రేమ వ్యవహారమని పుకార్లు" అన్నది. తర్వాత ఓ రోజు మాధవి సినిమానించి వస్తోన్నప్పుడు.

"మనవాళ్ళకి రక్తమాంసాలు లేవా?" అన్నవి – ఇవి జ్ఞాపకం రాగానే కృష్ణ, కేశవ్‌ని, మాధవిని చాలా నిశితంగా, చాకచక్యంగా గమనించసాగాడు. కేశవ్ బలవంతంగా నవ్వుతూ మాట్లాడుతున్నాడు అందరితో. అతని చూపులు మాత్రం ఎటు తిరిగినా మళ్ళీ మాధవి మీదికే వెళ్ళి నిలుస్తున్నాయి. మాధవి చూపులు భూమికి అంటుకుని అక్కడ్నించి కదలటం లేదు. కొంచెం సేపట్లోనే "బాంబే వెళ్ళే ప్లేన్ బైలుదేరబోతోన్నట్టు" అనౌన్స్‌మెంటు వినిపించింది.

"మీరు ఎవరికోసమో చూస్తున్నారేమో వాళ్ళెవరూ ఇంకా రానట్టున్నారు కదండీ" ఒకరు డాక్టర్ కేశవ్‌ని ప్రశ్నించారు. కేశవ్ నవ్వినట్టు చేసి ఎటువైపో చూడబోతే మాధవి కనిపించినట్టు, మాధవివైపు చూశాడు. కాని మాధవి కళ్ళైనా ఎత్తలేకపోయింది.

ఐనా కేశవ్ ప్లేన్‌లో ఎక్కేవరకు ప్లేన్‌లో ఎక్కాక కూడా ఎవరికోసమో చూస్తూనే వున్నాడు ఇంకా. రేష్మా పెళ్ళికి వెళ్తున్నానన్న మాధవి బాంబే ప్లేన్ బైలుదేర్తోన్నా – కృష్ణని అతుక్కునే నిల్చుంది.

రన్ వే మీదున్న ప్లేన్ ఆకాశంలోకి ఎగిరి మేఘాల్లోకి చొచ్చుకుపోయింది. దాని వైపే చూస్తో కాస్సేపు నిల్చుని తర్వాత మాధవిని తీసుకుని ఇంటికి వచ్చాడు కృష్ణ. మాధవి కనిపించగానే ఎంతో సంతోషంగా చప్పట్లు కొడ్తూ వీణ వచ్చి తల్లిని వాటేసుకుంది. వెంటనే మాధవి వీణని ఎత్తుకుని హృదయానికి అదుముకుని మేడమీది గదిలోకి వెళ్ళిపోయింది.

"బాంబేకి వెళ్తోన్న కోడలు తిరిగి వచ్చిందేం?" అని తల్లి అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పి తానూ పైకి వెళ్ళాడు కృష్ణ. అదేపనిగాకూతుర్ని ముద్దాడుతున్న మాధవిని చూస్తూ నిల్చున్నాడు. కృష్ణ రాకని గమనించిన మాధవి తన ఒడ్డిలోంచి వీణని క్రిందికి దింపింది. గదిలోనుంచి "డాల్" ఓటి తీసుకుని వీణ క్రిందికి వెళ్ళి పోయింది. వెంటనే కృష్ణ గది తలుపులు మూసి గడియవేసి వాళ్ళు కుర్చీలో కూర్చుని బలంగా ఊపిరి పీల్చుకుని.

"ఇట్లా ఎందుకు జరిగింది మధూ?" అని అడిగాడు భార్యని. మాధవి సమాధానం ఇవ్వకపోతే.

"సమాధానం ఇవ్వాల్సే వుంటుంది" అన్నాడు.

"ఎట్లా జరిగింది?" ముఖం చాటు చేసుకుని అడిగింది మాధవి.

"నువ్వు కేశవ్‌ని ప్రేమించావేమో! అతనితో బాంబే వెళ్ళిపోయి, ఏదైనా వ్యాపారం చేసుకుంటూ సుఖంగా బ్రతకాలని ఒకటి, రెండు నెలల నుంచైనా కలలు కని వుంటారు. పెద్ద ఎత్తులో ప్రోగ్రాం వేసుకుని ఉంటారు. మరి అతనితో వెళ్ళకపోవటం జరిగింది, ఎందుకు?"

".... .... .... ...."

"అతనైనా నిన్ను తీసుకువెళ్ళలేకపోయాడెందుకని?"

".... .... .... ...."

"అంటే – మీ ఇద్దరి నిర్ణయాలు ఇంత గట్టిగా ఉన్నాయన్న మాట. తుమ్మితే ఊడిపోయే ముక్కులాగా...."

".... .... .... ...."

"పాడు పనికైనా నిర్ణయాలు గట్టిగానే వుండాలి మధూ లేకపోతే ఆ పని చేయలేము."

"............"

కొంచెం సేపాగి కృష్ణ మళ్ళీ అన్నాడు.

"మధూ! నీలోఉండే మొండితనం, తెగింపు, పట్టుదల, దీక్ష ఏదైనా 'మంచి'కి వినియోగించుకుంటే దానివల్ల ముందు నీకు

మేలు జరుగుతుంది. ఆ తర్వాత నీ సంబం ధీకులకు. వాటినే చెడుకు వినియోగించు కుంటే ముందు అపకారం, నష్టం జరిగేవి నీకు. మనిషి ఎప్పుడూ తన మేలు, క్షేమం గురించి తానైనా యోచించుకునే స్థితిలో వుండగలగాలి మధూ!" చాలా బాధపడుతూ ఒడిలో ఓ పసిపాపకు చెబుతోన్న విధా నంలో భార్యకు చెప్పాడు కృష్ణ. ఆ తర్వాత తనని తాను చాలా పెద్ద ఎత్తులో అడ్జెస్ట్ చేసుకుని,

"నువ్వు చాలా పిచ్చిదానవు. నామీద కోపం తెచ్చుకోవటం తప్ప నిజం చెప్పు నీకేమైనా తెలుసా?" అని అడిగాడు.

మాధవి కళ్ళలోనుంచి నీళ్ళు అదేపనిగా కారిపోతున్నాయి. కన్నీళ్ళతో ముఖం అంతా తడిచిపోయింది. అట్లాగే భర్తవైపు తిష్వన తిరిగి—

"నేను మీ దగ్గరకు రాలేకపోతున్నాను. మీ మాటల్ని వింటూ ఇట్లా దూరంగా నిల్చోలేకపోతున్నాను. నన్ను ఏం చేయ మంటారో చెప్పండి" అని రెండు చేతుల్లో ముఖం దాచుకుని కొంచెం బిగ్గర గానే ఏడిచింది మాధవి. వెంటనే కృష్ణ—


"ఆ కన్నీళ్ళు తుడుచుకో! ఇట్లా ఏడ్వటం నీకు అసహ్యంగా లేదా?" అడి గాడు.

కన్నీళ్ళని తుడుచుకుంటోన్న మాధవి వైపు అట్లాగే ఎంతో నేహ్రం చూస్తూ నిల్చున్న కృష్ణ...."ఇట్లా నా దగ్గరకు రా...." రెండు చేతులూ చాచి పిలిచాడు.

వెంటనే మాధవి పసిపిల్లలా పరుగెత్తుకుని వెళ్ళి ఆ చేతుల్లోవాలి, ఆ కౌగిట్లో ఇమిడి పోయింది.

కృష్ణ ఆలింగనంలో మాధవి పూర్తిగా ప్రపంచాన్నే మరిచిపోయింది. అంతటి శక్తివంతమైనదేమో—ఆ ఆలింగనం !!

★




ఉగాది ప్రత్యేక కానుక

రు. 45,000 లు గెలుపొందండి!

# విజయసాహితి-18

మండపేట; తూ॥ గో॥ జిల్లా

8 క్లూలు మాత్రమే

| | |
|---|---|
| ఆల్ కరెక్టు | రు. 25,000 |
| 1, 2 తప్పులు | రు. 8,000 |
| మినీసాహితి | రు. 8,000 |
| ఆల్ మిస్టేక్స్ | రు. 4,000 |

ముగింపు : 28–3–77 కీ సొల్యూషన్ : 3–4–77. జ్యోతి డైరీలో

1 ఎంట్రీ 1-00 6 ఎంట్రీలు 4-00 25 ఎంట్రీలు 15-00

ప్రతి 6 ఎంట్రీలకు 1 మినీ సాహితి ఉచితం. (మినీ సాహితి 1,2,3,4,5 ప్రశ్నలు ఆల్ కరెక్టుకు మాత్రమే)

అందరికన్నా ఎక్కువ ఎంట్రీలు పంపిన ముగ్గురు పోటీదారులకు 3 ట్రాన్సిస్టర్స్ రేడియోలు బహుమతులుగా ఇవ్వ బడును. విజేతల ఫొటోలు పూర్తి అడ్రసులతో సహా ఆంధ్రజ్యోతి వీక్లీలో ప్రచురించబడతాయి.

ఆధారములు :– 1. 1976 లో బంగారు నంది అవార్డుకు ఈ చిత్రం ఎన్నిక అవుతుందని అంటున్నారు– (అంతులేనికథ/సీతా కళ్యాణం/సిరిసిరిమువ్వ) 2. 1976 లో అతి తక్కువ చిత్రాలలో నటించిన నటీమణి– (లక్ష్మి/శారద/ప్రమీల) 3. ఈతడు నటుడే అయినా చిత్రానికి కథలు కూడా వ్రాస్తాడు– (రామారావు/బాలయ్య/రాజబాబు) 4. విభిన్న పాత్రలు పోషించుటలో ఈ నటునికి మంచి పేరు ఉంది– (గుమ్మడి/రావుగోపాలరావు/సత్యనారాయణ) 5. తెలుగు చిత్రాలలో కథానాయికగా ఈ నటి తన స్థానాన్ని పెంచుకుం టుంది– (రోజారమణి/శ్రీదేవి/ప్రభ) 6. సాహిత్యపరంగా పాటలు వ్రాయటంలో ఈతనికి మంచి పేరు ఉంది– (దాశరథి/నారాయణ రెడ్డి/ ఆత్రేయ) 7. 1975 లో ఈతడు దర్శకత్వం నెరిపిన చిత్రానికి రాష్ట్ర నంది అవార్డు లభించింది– (బాపు/విశ్వనాథ్/దాసరి) 8. నాట్య తారగా ఈ నటికి ఉన్నంత పేరు మరింకే నటికి లేదు– (జయకుమారి/విజయలలిత/జయమాలిని).

నిబంధనలు :–1 తెల్ల కాగితంపై మీరు కోరుకునే పదములు వరుసగా వ్రాసి, రుసుము క్రాస్ చేయని I. P. O. ద్వారా గాని, M. O. ద్వారాగాని పంపుతూ M. O. రశీదు తప్పక జతపర్చాలి. 2. M. O. రశీదు లేని ఎంట్రీలు, ముగింపు తరువాత చేరు ఎంట్రీలు పోటీకి తీసుకోబడవు. 3. ఒకరు ఎన్ని ఎంట్రీలు అయినా గెలుపొందవచ్చును. 4. మేనేజిమెంటు వారిదే తుది నిర్ణయం. 5. స్టేట్ బ్యాంకు లాకరులో సీలు చేయబడి గ్రామాధికారుల సమక్షంలో తెరువబడే కీ సొల్యూషన్ తో సరిపోలని ప్రతీ మాట ఒక తప్పుగా లెక్కించ బడును. 6. విజేతల లిస్టుకు, పోటీ నెం–19 ఎంట్రీలకు 40 పై.ల స్టాంపులు పంపండి. మీ ఎంట్రీలు M. O. లు.

**VIJAYA SAHITHI, MANDAPETA,** E. G. Dt కు పంపండి.